క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



తెనాలి అర్బన్: కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం ఉపాధ్యాయులకు జేఎంజే కళాశాలలో రెండో విడత శిక్షణ తరగతులు జరుగుతున్న నేపథ్యంలో సుల్తానాబాద్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన ఉపాధ్యాయునిలకు డాక్టర్ రక్షిత్ వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలను పూర్తిగా తొలగించాలి



తెనాలి అర్బన్: మ్యాన్ హోల్స్‌లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. 2వ వార్డులో సోమవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఆ ప్రాంతంలో పర్యటిస్తూ రోడ్లపై ఉన్న వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే కాలువల పూడిక తీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



తెనాలి టౌన్: ధర్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక నెహ్రూరోడ్డులోని గోవర్ధనస్వామి దేవాలయంలో సోమవారం సమర సత సేవా ఫౌండేషన్ తెనాలి మండల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కడియాల సునీల్‌కుమార్, కె.బైరాగి, డి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం



మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంబడి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సెంటినీ సిటీ హాస్పిటల్ సహకారంతో గుండె, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి బెటాలియన్‌లో అధికారులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ నరాలశెట్టి అనిల్, ఊపిరితిత్తుల వ్యాధుల డాక్టర్ ఎస్‌వీ శివ ప్రసాదరెడ్డి, ఏపీఎస్పీ కమాండెంట్ నగేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతప్ప, అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారావు, పావనరావు, సెక్రటరీ జీబీకే గోవర్ధన్, ట్రెజరర్ ఎస్ఎస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్మెస్కే శ్రీధర్ పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్



మంగళగిరి: మండలంలోని చినకాకాని శివారు ప్రాంతంలోని రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపిన వివరాల మేరకు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.20,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడం జరుగుతుందన్నారు. రూరల్ స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందేలు ఇతర చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుండవరంలో మహిళకు పాముకాటు

గుండవరం (చేబ్రోలు): వ్యవసాయ పనులు చేస్తున్న మహిళను పాము కాటువేయడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో సోమవారం జరిగింది. గుండవరం గ్రా మానికి చెందిన మక్కే వీరకుమారి వారు సాగు చేస్తున్న చిక్కుడు పందిరి తోటలో పనులు చేస్తోంది. అదే సమయంలో ఆమె చేతిపై పింజేరి పాము కాటు వేసింది. సమీపంలోని మహిళలు గమనించి తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను 108 వాహ నం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సమస్యలపై పీజీఆర్ఎస్‌లో అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశంలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ 17 మంది అర్జీలను అందజేశారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పట్టణ పినపాడుకు చెందిన అంగిరేకుల హరిశంకరరావు తన భూమిని రీసర్వే చేయించి సర్వే సర్టిఫికెట్‌ను ఇప్పించాలని కోరుతూ సబ్‌కలెక్టర్‌కు అర్జీని చ్చారు. సమీప మల్లెపాడు గ్రామంలో సర్వే నంబర్ 154ఏలో తనకు 48 సెంట్ల పంట భూమి ఉందని.. రికార్డు కొలతల ప్రకారం అధికారులు 46 సెంట్లను మాత్రమే చూపుతున్నారని తెలిపారు. దీనిపై రీసర్వే చేయాలని రైతు అభ్యర్థించారు. సంబంధిత శాఖలకు ఆయా అర్జీలను పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ సంజనా సింహ వెల్లడించారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

రుణాలు తిరిగి కట్టేలా చర్యలు తీసుకోవాలి

తెనాలి అర్బన్: 25వ వార్డులోని ఆలీ స్వయం స్వయం సహాయక సభ్యుల వద్ద నుంచి వసూలు చేసిన బ్యాంకు రుణాలను సంఘ లీడర్ షేక్ ఖాజ బీ వినియోగించుకుని చెల్లించడం లేదని.. వాటిని కట్టే విధంగా చూడాలని సంఘ సభ్యులు మున్సిపల్ మేనేజర్ విల్సన్ జయకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. పలు అర్జీలను ప్రజలు అధికారికి అందజేశారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువులు కట్టించాలని.. సీసీరోడ్లు వేయాలని తదితర వినతిపత్రాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబు, డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు నిలుపుదల చేయాలని వినతి

తెనాలి: కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును నిలుపుదల చేయాలని కోరుతూ పట్టణ కొత్తపేటకు చెందిన పలువురు సోమవారం మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్యవైశ్యులు అధికంగా ఉండే కొత్తపేటలో సరోజిని నాయుడు వీధి, వాసుదేవన్ వీధి కార్నరు భవనంలో వైన్స్ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయని వారు తెలియజేశారు. ఆయా వీధుల్లో నేటికీ ప్రశాంతమైన వాతావరణం ఉందని.. ప్రస్తుతం అక్కడ మద్యం షాపును ఏర్పాటు చేస్తే ఆ ప్రశాంతతకు భంగం వాటిల్లుతుందని వారు తెలిపారు. తమ వినతిని పరిగణనలోకి తీసుకుని ఆ వైన్స్‌ను అక్కడ నడపకుండా తగిన ఆదేశాలు జారీ చేయాల్సిందిగా కోరారు. సరోజిని నాయుడు వీధి, వాసుదేవన్ వీధి, కృష్ణారావు నాయుడు వీధికి చెందిన పలువురు పాల్గొన్నారు.

తెనాలి రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు స్వీకరించినట్లు తెనాలి తాహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం కొత్తపేట తాహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలు ప్రాంతల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని, ప్రజా వినతులపై అలసత్వం వహిస్తే సహించమని ఆయన అధికారులకు సూచించారు.



జయకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు



మండల తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న ప్రజలు

బాలీవుడ్‌కు దీటుగా టాలీవుడ్

జాతీయ పురస్కార గ్రహీతలకు 'మా–ఏపీ' అభినందన తీర్మానం

తెనాలి: నూతన సాంకేతిక ప్రమాణాలే తెలుగు సినిమాకు జాతీయ కిరీటం తెచ్చి పెట్టాయని 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. స్థానిక 'మా–ఏపీ' కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో జాతీయ పురస్కారాలకు ఎంపికైన ఏడుగురు తెలుగు నటీనటులు/సాంకేతిక నిపుణులు/నిర్మాతలకు అభినందన తెలియజేస్తూ తీర్మానించారు. దిలీప్‌రాజా మాట్లాడుతూ.. భారత చలనచిత్ర 71వ జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాకు ఏడు పురస్కారాలు రావడంతో బాలీవుడ్‌కు దీటుగా టాలివుడ్ నిలిచిందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నటుడు వేమూరు విజయ్‌భాస్కర్, ఆరాధ్యుల కన్నా, అయ్యప్ప, గంగారపు సుబ్బారావు, బసవ రత్న, వుయ్యూరు విశ్వనాథ్, కారుమూరు శివరామిరెడ్డి, వాకా ఆదినారాయణ, తస్నీరు రమణ, చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

ఇన్‌స్పైర్ ఒరియెంటేషన్ శిక్షణలో భాగస్వాములు కావాలి

తెనాలి టౌన్: విద్యార్థులు ఇన్‌స్పైర్ ఒరియెంటేషన్ శిక్షణలో భాగస్వాములు కావాలని ఉపవిద్యాశాఖాధికారి శాంతకుమారి పిలుపునిచ్చారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సోమవారం ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్‌కే గౌసుల్ మీరా సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా శాంతకుమారి పాల్గొని కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుదామని ఆమె సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులు, ఇన్‌స్పైర్ ఒరియేంటేషన్ శిక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని, విధిగా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వి.జయంతిబాబు, రిటైర్డ్ హెచ్ఎం ఆర్.శివనాగేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్‌లు డి.శివశంకరరావు, డి.వి.రమణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి శాంతకుమారి

డిజిటల్ చెల్లింపులపై అవగాహన ఉండాలి

పెదకాకాని: విద్యార్థులు డిజిటల్ చెల్లింపులు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ భాస్కరరావు అన్నారు. మండలంలోని నంబూరు ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం బ్యాంకింగ్ వ్యవస్థలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రతినిధి (సీఎస్ఏ) జి.కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకుల విధివిధానాలను తెలుసుకోవాలన్నారు. తప్పనిసరిగా బ్యాంకింగ్ పోల్డర్‌లో చేర్చబడాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కలిగి బ్యాంకింగ్ సేవలను తెలివిగా ఉపయోగించుకోవాలన్నారు. బ్యాంక్ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం బ్యాంకు లావాదేవీలపై వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ ప్రతినిధి ఆర్.పవన్ కుమార్, పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ పి.హుస్సేన్, వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్‌లు వై.బాబురావు, ఎం.రామకృష్ణ, పి.రత్నశేఖర్, కె.నరేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బాబురావు, హెచ్ఎం భాస్కరరావు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టిన లారీ

వేజండ్ల(చేబ్రోలు): ఆటో దిగుతున్న మహిళను అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో మహిళ మృతి చెందిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. వేజండ్ల గ్రామానికి చెందిన జంపని రెబ్కా ఉరఫ్ ప్రశాంతి (27) తెనాలి నుంచి ఆటోలో బయలు దేరి వేజండ్ల అడ్డరోడ్డు వద్ద దిగి డ్రైవర్‌కు డబ్బులు ఇస్తోంది. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఆగి ఉన్న ఆటోను, మహిళను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రెబ్కా తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సంఘటనా ప్రాంతంలో పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో ఆటోలో మరో ముగ్గురు ఉన్నప్పటికి వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రెబ్కా

కార్మికులు దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలి



మంగళగిరి: మంత్రి లోకేష్ నియోజకవర్గంలో పారిశుద్ధ్య(ఎంబుక్) కార్మికులు దోపిడికి గురవతున్నారని సీఐటీయూ నాయకుడు వేమూరు దుర్గారావు తెలిపారు. ఎంబుక్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ కార్మికులు ఒక్కొక్కరి దగ్గర రూ.5 వేలు దోచుకుంటున్నారని, అధికారులకు తెలియజేసినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు చాలీచాలని జీతంతో జీవనం కొనసాగిస్తున్నారని, కాంట్రాక్టర్ మాత్రం రూ.10 వేలు మాత్రమే ఇస్తాను.. చేస్తే చేయండి లేదంటే వెళ్లిపోవచ్చంటున్నారన్నారు.

మృతవీరుల సంస్మరణ సభ రేపు

తెనాలి అర్బన్: దళిత మృతవీరుల సంస్మరణ సభను చుండూరులో బుధవారం నిర్వహించనున్నట్లు చుండూరు దళిత బాధితుల పోరాట కమిటీ అధ్యక్షుడు జాలాది మోజెస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1991 ఆగస్టు 6న చుండూరు దళితులపై అగ్రవర్ణాలు దాడి చేసి ఎనిమిది మంది దళితులను హతమార్చిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఉదయం చుండూరులోని రక్తక్షేత్రం వద్ద మృతవీరులకు నివాళులర్పించి సంస్మరణ సభ నిర్వహించనున్నామని ఆయన అన్నారు. ప్రముఖ దళిత సంఘ నాయకులు, మేధావులు, మానవతవాదులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని చెప్పారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రేపు టౌన్ పాస్టర్స్ సమావేశం

తెనాలి టౌన్: స్థానిక ముల్లెంశెట్టిపాలెంలోని యేసయ్య ప్రార్థనా మందిరంలో బుధవారం ఉదయం 10 గంటలకు ది తెనాలి టౌన్ పాస్టర్స్ గ్రేట్ సపోర్ట్ అండ్ పుల్ హెల్పింగ్ అసోసియేషన్ సమావేశం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షులు బ్రదర్ ఆనందన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్టర్లకు ఉచితంగా రైస్ బ్యాగ్‌ల పంపిణీ వంటి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అసోసియేషన్‌లోని పాస్టర్లు విధిగా హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదని అంగన్‌వాడీలు ధర్నా

తెనాలి టౌన్: 2022 సంవత్సరంలో ఇచ్చిన సెల్‌ఫోన్‌లు సరిగా పనిచేయడం లేదని.. యాప్‌లో ఫేస్ రికగ్నేజేషన్ పొందుపరచాలంటే ఫోన్ నెట్‌వర్క్ సహకరించడంలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోయారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీడీపీవో విజయగౌరికి తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను అందజేసి వినతిపత్రం ఇచ్చారు. కొత్త స్మార్ట్ ఫోన్‌లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను వారు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాలు ఏవీఎన్ కుమారి, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలకు విఘాతం


తెనాలి అర్బన్: పోస్టాఫీసులో సోమవారం ఆన్‌లైన్ సేవలకు విఘాతం కలిగింది. ఉదయం నుంచి సర్వర్ పనిచేయలేదు. దీంతో వివిధ రకాల సేవలన్నీ నిలిచిపోయాయి. పోస్టాఫీసుల్లో నగదు డ్రా చేయడం, ఇతర సేవలు పొందడానికి వచ్చిన వారంతా గంటల కొద్ది అక్కడే ఉండి నిరాశగా వెనుదిరిగి వెళ్లారు. దీనిపై అధికారులు కూడా స్పష్టత ఇవ్వలేకపోయారు. దీంతో తెనాలి పట్టణంలోని అన్ని పోస్టాఫీసులకు వచ్చిన ఖాతాదారులు, వివిధ సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

తెనాలి రూరల్: డ్రోన్ కెమెరా సహాయంతో పోలీసులు జూదరులను అరెస్ట్ చేశారు. పట్టణ పినపాడు ప్రాంతంలో సోమవారం సాయంత్రం త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు, సిబ్బంది డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. నిర్మానుష్య ప్రాంతంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

మంగళగిరి: పట్టణంలోని కొత్తపేటలో డ్రైనేజి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ శకుంతలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్తపేటలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం వలన రోడ్లపైకి మురుగు నీరు చేరి దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, వల్లభాపురం నాగేశ్వరరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి

కొల్లిపర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కళ్లం వెంకటప్పారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి అన్నారు. కొల్లిపర మండలంలోని మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం, పిడపర్తి పాలెం గ్రామాల్లో సోమవారం పార్టీ నాయకులు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పార్టీ నాయకులు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు పెడుతూ జైళ్లకు పంపుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వల్లభాపురం నిర్మల, వేమూరి ధీనమ్మ, బొల్లు కరుణశ్రీ, పిల్లి రాధిక, ఆయా గ్రామాల పార్టీ నాయకులు అవుతు పోతిరెడ్డి, అవుతు నగేష్ రెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి, ఆళ్ల నాగిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు సుజాత, భీమవరపు శివకోటిరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, ఎంపీటీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మున్నంగిలో కరపత్రాలు పంపిణీ

డ్వాక్రా మహిళలకు ఆరోగ్య అంశాలలోనూ తోడ్పాటు

వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

తెనాలి: మహిళలకు ఆర్థికపరమైన అభివృద్ధికి తోడ్పడుతున్న వెలుగు ప్రాజెక్టు.. ఆరోగ్యపరమైన అంశాలలోనూ కృషి చేయటానికి శారద సర్వీస్ సొసైటీ సహకారంతో అవకాశం లభించడం సంతోషంగా ఉందని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మహిళలకు ఆరోగ్యపరమైన అంశాలపై మండల, పట్టణ, జిల్లా సమాఖ్యా సమావేశాల్లో చర్చించడం మినహా.. తగిన కార్యాచరణ లేని తరుణంలో డాక్టర్ డి.శారద, మహిళలకు ఉచితంగా వ్యాధులకు స్క్రీనింగ్ చేసి సహకరించడం గొప్ప విషయమన్నారు. సొసైటీ సహకారంతో ఈ సేవలను జిల్లాకు విస్తరిస్తామని తెలిపారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత నెలలో డీ3 శారద సర్వీస్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో డాక్టర్ డి.శారద తన సత్యసాయి నర్సింగ్ హోమ్‌లో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. కొల్లిపర, తెనాలి మండలాల ఏపీఎంల సహకారంతో డ్వాక్రా మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌ను ఉచితంగా నిర్వహించారు. ఆ పరీక్షల్లో 25 మందికి వ్యాధి లక్షణాలున్నట్టు గుర్తించారు. నివారణ సలహాలతో నివేదికలను సిద్ధం చేశారు. ఆయా నివేదికలను మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు, సంబంధిత మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో తెనాలి ఎంపీడీవో అత్తోట దీప్తి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



పరీక్షల నివేదికల పంపిణీలో విజయలక్ష్మి, డాక్టర్ శారద, గోపాలకృష్ణ

తల్లిపాలతో రొమ్ము క్యాన్సర్ దూరం

తెనాలి అర్బన్: తల్లిపాల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ పిలుపునిచ్చారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొత్తపేటలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వాల్ పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ వంటివి నివారించవచ్చునన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో పి.విజయగౌరి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎ.సౌజన్య, వై.నాగమణి, వై.యామిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ సంజన సింహా, డాక్టర్ అన్నపూర్ణ

వరి మొలకలు.. నేల చూపులు



వెంకటకృష్ణాపురం శివారులో ఎండ గాలులకు వాడిపోతున్న వరి మొలక



గోళ్లమూడి శివారులో అధిక వర్షాలకు మొలకలు కుళ్లిపోవడంతో రెండోసారి వరి విత్తనం పెట్టిన పొలాలు

- తూలుతున్న అన్నదాత ఆశలు
- అన్నదాతకు ఆదిలోనే సాగునీటి అవస్థలు
- ఆయిల్ ఇంజన్‌లతో నీళ్ళు
- అతివృష్టి. అనావృష్టితో రైతుల అవస్థలు

పెదకాకాని: అన్నదాతలకు ఆరంభంలోనే అవస్థలు మొదలయ్యాయి. ఈ ఏడాది మే నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభించలేదు. వరి విత్తనం ఎదపెట్టే దశలో వర్షాలు కురవకుండా పోయాయి. విత్తనం పెట్టే సమయం మించి పోతుండటంతో అన్నదాతలు జూన్ చివరి వారం, జులై నెల మొదటి వారం రోజుల్లో బెట్ట దుక్కుల్లోనే వరణుడు కరుణించక పోతాడా అనే నమ్మకంతో మండలం అంతటా వరి విత్తనాలు ఎదపెట్టారు. పెదకాకాని మండలంలోని నంబూరు, గోళ్ళమూడి, పెదకాకాని, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, రామచంద్రపాలెం, తంగెళ్ళమూడి, అనుమర్లపూడి గ్రామాల్లో వరి పంట సాగు సుమారు 16 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. రైతులు విత్తనం ఎదపెట్టిన తరువాత వారం రోజుల పాటు వర్షాలు కురవలేదు. పంట కాలువలకు నీరూ వదల్లేదు. ఆ తరువాత కురిసిన అధిక వర్షాలకు పొలాల్లోకి ఎక్కువగా నీరు చేరి నిలిచిపోవడంతో మొలక దశలో ఉన్న వారి విత్తనాలు నీటిలోనే కుళ్ళిపోయాయి. మెరకగా ఉన్న పొలాల్లో, నీరు నిల్వ లేకుండా చేసిన పొలాల్లో వరి విత్తనం మొలక బాగానే వచ్చింది. విత్తనం కుళ్లిపోయిన పొలాల్లో అక్కడక్కడా మొలక కనిపిస్తూ పైరు చాలీచాలనట్లు ఉండటంతో రైతులు పొలం ఆరిన తరువాత మళ్ళీ దుక్కులు దున్ని విత్తనాలు రెండవసారి పెడుతున్నారు.

వరి మొలక ఎండిపోకుండా ఇంజన్‌లతో నీళ్లు

మండలంలో వరి మొలక వచ్చిన 15 రోజుల నుంచి వరుణుడు ముఖం చాటేశాడు. వర్షాలు లేకపోవడంతో పాటు వేసవి కాలాన్ని తలపిస్తున్న ఎండలు, గాలులకు పొలాల్లో ఉన్న తేమశాతం కూడా తగ్గిపోయి మొలసిన వరి వడబడటం, ఎండిపోతున్నాయి. దీంతో మొలచిన వరి మొక్కను కాపాడుకునేందుకు అన్నదాతలు ఆయిల్ ఇంజన్‌లను ఆరంభంలోనే పొలాలకు తరలిస్తున్నారు. పంట కాలువలకు నీరు వదలడంతో ఆ నీటిని పొలాలకు ఇంజన్ల సాయంతో పెట్టి పంటను కాపాడుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. పంట కాలువలకు దగ్గరలో ఉన్న రైతుల పరిస్థితి ఇలా ఉంటే పంట కాలువలకు దూరంగా ఉన్న పొలాలకు రైతులు తమ దాకా కాలువ నీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వరుణదేవుని కరుణకై ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే అన్నదాతల పరిస్థితి వెనుక నుయ్యి ముందు గొయ్యి అన్న చందంగా మారింది. మొలకను కాపాడుకునేందుకే ఆయిల్ ఇంజన్‌లతో నీళ్లు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో పంటలు పండించడం ఎలాగా అని పలువురు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.